
సాక్షి
అనంతపురం
శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.16

అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/21.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూల్ ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2025–26 విద్యా సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్ ప్రవేశాలకు రూ. 200 అపరాధ రుసుంతో అక్టోబరు 31 దాకా గడువు పొడిగించినట్లు డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతిలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. 15 ఏళ్లు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్ ప్రవేశాలకు అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు స్వయంగా ఇంటర్‌నెట్, మీసేవా, ఏపీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండుసెట్ల జిరాక్స్ కాపీలను ఎంపిక చేసుకున్న స్టడీ సెంటర్లలో అందజేసి దరఖాస్తు నిర్ధారణ చేసుకోవాలని కోరారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్ధారణ అయిన తర్వాత అభ్యర్థి ఫోన్ నంబరుకు వచ్చిన మెసేజ్ ఆధారంగా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్, ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు, డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: అహుడా అనుమతి లేని ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సూచించారు. గురువారం స్థానిక అహుడా కార్యాలయంలో చైర్మన్ వరుణ్‌తో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 23లోపు రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. సమావేశంలో అహుడా కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలు సాధించాలి

- కలెక్టర్ ఆనంద్



అనంతపురం అర్బన్: ''లక్ష్యసాధనలో ఏ దశలోనూ నిర్లక్ష్యం వహించకూడదు. గడువులోగా పూర్తి చేయడంపై దృష్టి పెట్టండి'' అని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులు, బ్యాంకర్లకు సూచించారు. కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లాస్థాయి సమీక్షా కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఈజీపీ, ముద్ర, పీఎం విశ్వకర్మ, తదితర కేంద్ర, రాష్ట్ర పథకాలకు సంబంధించి రుణ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బ్యాంకర్లు లక్ష్యాలను పూర్తిచేయడంలో పురోగతి చూపడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీల పరిధిలో అన్ని బ్యాంకుల బ్రాంచ్‌లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులకు సమాచారం అందించాలని చెప్పారు. రూడ్ సెట్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. 'సీఎస్ఆర్' కింద ఆర్థిక సహకారం అందించాలన్నారు. పీఎస్ఎల్ లక్ష్యాలు,ప్రభుత్వ పథకాలకు సంబంధించి రుణ లక్ష్యాలను కచ్చితంగా చేరుకోవాలన్నారు. విద్యా రుణాలను గత ఏడాది కన్నా తక్కువగా ఇచ్చారంటూ అసహనం వ్యక్తం చేశారు. పీఎంఎఫ్ఎంఈ కింద 300 యూనిట్ల మంజూరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రుణాలివ్వాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, ఆర్‌బీఐ అధికారి రాహుల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పసి ప్రాణం ఉక్కిరిబిక్కిరి



న్యుమోనియాతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పసికందు

వామ్మో న్యుమోనియా

- జిల్లాలో ప్రబలుతున్న మహమ్మారి
- జలుబు, దగ్గు, జ్వరంతో చిన్నారుల అవస్థలు
- సర్వజనాస్పత్రిలో నిత్యం నమోదవుతున్న కేసులు
- మారిన వాతావరణంతో రోగం బారిన పడుతున్న పసికందులు
- 'ప్రైవేటు'ను ఆశ్రయిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్న తల్లిదండ్రులు
- సర్వజనాస్పత్రిలో మెరుగైన చికిత్సలు



వైరల్ న్యుమోనియా కేసులతో కిటకిటలాడుతున్న సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డు

అనంతపురం మెడికల్: పసి ప్రాణాన్ని మహమ్మారి పట్టుకుంటోంది. పాలు కూడా తీసుకోలేని స్థితికి తీసుకెళ్తోంది. ఊపిరి కూడా సలపనంతంగా ఆవరించి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జిల్లాలో ఇటీవల చిన్నారుల న్యుమోనియా కేసులు పెరుగుతున్నాయి.చాపకింద నీరులా మహమ్మారి వ్యాప్తి చెందుతుండడం అందరినీ కలవరపరుస్తోంది. అనంతపురం సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డుల్లో న్యుమోనియా కేసులు రోజు రోజుకూ అధికమవుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో రోజూ 40 నుంచి 60 అడ్మిషన్లు జరుగుతుండగా.. అందులో సగానికి పైగా వైరల్ న్యుమోనియా కేసులు ఉండడం గమనార్హం. గడిచిన నెలన్నరలో న్యుమోనియా బారిన పడిన వెయ్యి మంది చిన్నారులకు వైద్యులు చికిత్సలు అందించారంటే ఎంతగా ప్రబలిందో అర్థం చేసుకోవచ్చు.

వైద్యులను సంప్రదించాలి..

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. అందులో న్యుమోనియా ఒకటి. మూడేళ్లలోపు పిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడంతో ఎక్కువగా వ్యాధి బారిన పడతారు. ఇటీవల వాతావరణంలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడానికి తోడు రద్దీగా ఉండే ప్రాంతాల్లో పిల్లలను తిప్పడం వల్ల వ్యాధి మరింత వ్యాప్తి చెందుతుంది. మొదటగా జలుబుతో ప్రారంభమై దగ్గు, జ్వరం, ఆయాసం తదితర లక్షణాలు బయటపడుతాయి. అనంతరం చిన్నారులు తల్లిపాలను తీసుకునేందుకు కూడా ఇబ్బంది పడుతూ ఉక్కిరిబిక్కిరవుతారు. ఇటువంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులకు అందించే ఆహారంలో శీతల పదార్థాలు లేకుండా చూసుకోవాలి. న్యుమోనియా లక్షణాలు కన్పిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

పడకల సమస్య..

సర్వజనాస్పత్రి చిన్నపిల్లల వార్డులో మూడు యూనిట్లలో 90 పడకలుంటే ప్రస్తుతం 187 మంది అడ్మిషన్‌లో ఉన్నారు. సగానికిపైగా న్యుమోనియా కేసులున్నాయి. వైరల్ ఫీవర్‌తో 42 మంది ఇబ్బంది పడుతున్నారు. వార్డులో సరిపడునన్ని పడకలు లేకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురిని ఉంచి వైద్య సేవలందించాల్సిన పరిస్థితి నెలకొంది. నెబులైజేషన్ కోసం క్యూ కట్టాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రభుత్వాస్పత్రే మేలు..

సర్వజనాస్పత్రిలో చిన్నపిల్లల వైద్యులు న్యుమోనియా కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సేవలందిస్తున్నారు. దీంతో చిన్నారులు వేగంగా కోలుకుంటున్నారు. రామగిరికి చెందిన దంపతులు ఇటీవల న్యుమోనియా బారిన పడిన తమ కుమారుడిని అనంతపురం నగర శివారులో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ రూ.వేలల్లో ఖర్చు చేసినా బిడ్డ ఆరోగ్యంలో మార్పురాలేదు. వెంటిలేటర్‌పై ఉన్న పసికందును సర్వజనాస్పత్రికి తీసుకురాగా వైద్యులు మెరుగైన వైద్య సేవలందించడంతో ఇటీవల కోలుకుంటున్నాడు.

నిర్లక్ష్యం చేయొద్దు...



చిన్నారుల్లో వైరల్ న్యుమో నియా అధికమవుతోంది. మందుల షాపులు, ఆర్ఎంపీల వద్దకు వెళ్లి కౌంటర్ మెడిసిన్ వాడొద్దు. అందుబాటులో ఉన్న చిన్నపిల్లల వైద్యులను సంప్రదించాలి. చిన్నారుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదు. – డాక్టర్ సంజీవయ్య, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

మనోడే వదిలేయండి!

- అక్రమార్కుడికి ప్రజాప్రతినిధి అండ
- 'షాడో' సొంతూరు కావడంతో అధికారులపై ఒత్తిళ్లు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు అక్రమార్కులకు వంత పాడుతున్నారు. అడ్డగోలు వ్యవహారాల్లో ఆరితేరినా.. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినా వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఉన్నతాధికారుల సంతకం లేకుండా రూ.లక్షలు చెల్లించాలంటూ బిల్లులను తయారు చేశారు. ఈ విషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ రాజశేఖర్ సీరియస్‌గా పరిగణించి సదరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో పాటు మరో ఇద్దరిని సర్వీసు నుంచి తొలగించాలని డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు లేఖ రాయాలని నిర్ణయించారు.

చూసీ చూడనట్లు వెళ్లండి!

ఇటీవల నగరపాలక సంస్థలో జరిగిన ఓ కార్యక్రమానికి ప్రజాప్రతినిధి, అతని 'షాడో' వచ్చారు. 'మా వోడే కాస్త చూసీ చూడనట్లు వెళ్లండి. అతన్ని ఎక్కడికీ మార్చకుండా ఉంచండి' అని ప్రజాప్రతినిధి నగరపాలక సంస్థలోని కీలక అధికారిని ఆదేశించారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిందని అధికారి చెప్పగా.. 'ఏం కాదులే మా ఊరోడే.. కాస్త నిజాయితీపరుడేలేండి' అంటూ ప్రజాప్రతినిధి షాడో కోరస్ పలికారు. అంతలోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సైతం తానేం తక్కువ తినలేదన్నట్లు ఉన్నతాధికారి ముందు ఫోజు కొట్టాడు. నిబంధనల మేరకు తాను నీటి సరఫరా బిల్లులు చేశానని గొప్పలు చెప్పాడు. దీంతో ఉన్నతాధికారి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా ఎలా సంతకాలు చేసి బిల్లులు చేస్తావంటూ మండిపడ్డారు. ఈ తతంగమంతా గమనిస్తున్న అక్కడి వారు నివ్వెరపోయారు. నగరపాలక సంస్థలో అక్రమార్కులకు ప్రజాప్రతినిధి, ఆయన అనుచరులు వంత పాడుతుండడంతోనే అవినీతి, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి.

అగ్రి ల్యాబ్‌లకు చంద్రగ్రహణం

- రైతు సంక్షేమమే లక్ష్యంగా గత ప్రభుత్వంలో ఏర్పాటు
- కూటమి అధికారంలోకి వచ్చాక నిర్వహణపై నిర్లక్ష్యం
- జరగని పరీక్షలు.. అందని ఫలితాలు
- నకిలీ విత్తనాలతో చిత్తవుతున్న రైతులు



రాయదుర్గంలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్

రాయదుర్గం: విత్తనం మంచిదైతే పంట బాగుంటుంది. పంట కళకళలాడితే దిగుబడికి దిగులుండదు. ధరలూ కలిసొస్తే రైతుకు తిరుగుండదు. అంతా సవ్యంగా జరగాలంటే మేలి రకం విత్తనం కావాలి. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అగ్రి ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, నార్పల, అనంతపురం, గుంతకల్లులో అగ్రి ల్యాబ్‌లు నిర్మించారు. ఒక్కో ల్యాబ్ నిర్మాణానికి, వసతులకు రూ.కోటి ఖర్చు చేశారు. మట్టి నమూనాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పరీక్షలతో పాటు పశుసంవర్ధక శాఖ, ఆక్వా కల్చర్ అభివృద్ధిలో భాగంగా అందుకు సంబంధించి పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు. రాయదుర్గంలో స్వయంగా జగన్ చేతుల మీదుగా అగ్రి ల్యాబ్‌ను ప్రారంభించారు.

కూటమి ప్రభుత్వంలో నష్టాలు..

అగ్రి ల్యాబ్‌ల ద్వారా విత్తన పరీక్ష నివేదిక వారం నుంచి పది రోజుల్లోనే పొందవచ్చు. పురుగు మందులు, ఎరువుల నాణ్యత నిర్ధారణ రిపోర్టును రెండు లేదా మూడు రోజుల్లోపు అందిస్తారు. రైతులు కాకుండా ఇతర ప్రైవేటు వ్యాపారులు, డీలర్లు, తయారీదారులు నాణ్యత ప్రమాణాల పరీక్ష నివేదిక కోసం ఎరువుల రకాన్ని బట్టి రూ. వెయ్యి నుంచి రూ. 3 వేల వరకు చెల్లిస్తే చాలు. విత్తనాల నివేదిక కోసం రూ.200 మాత్రమే చెల్లించేలా రుసుం విధించారు. రైతులకైతే సేవలన్నీ ఉచితం. ఇలా ఎంతో మేలు చేకూర్చేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్రి ల్యాబ్‌ల నిర్వహణను కూటమి ప్రభుత్వం గాలికొదిలేయడంతో సేవలేవీ రైతులకు అందడం లేదు. వసతుల కల్పనతో పాటు సిబ్బందిని సర్దుబాటు చేయడంలో నిర్లక్ష్యం చూపడంతో నేడు నామమాత్రంగా పరీక్షలు జరుగుతున్నాయి. అది కూడా రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుత్తి అగ్రి ల్యాబ్‌లలో మాత్రమే అరకొరగా టెస్టింగ్‌లు చేస్తున్నారు. మిగిలిన చోట్ల అవి కూడా లేవు. జిల్లాలో ఏటా వరి, కంది, పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు రైతులు సాగుచేస్తున్నారు. అగ్రి ల్యాబ్‌లు సరిగా పనిచేయని నేపథ్యంలో నకిలీ విత్తనాలను కొంటూ నష్టాలు మూటకట్టుకుంటున్నారు.

రైతులను చులకనగా చూడొద్దు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాయదుర్గంలోని అగ్రి ల్యాబ్‌లో బాగా పరీక్షలు నిర్వహించారు. నేడు కేవలం మెలకశాతం మాత్రమే చేస్తున్నారు. పశు సంవర్ధక, మత్స్యశాఖలకు సంబంధించిన సేవలు కనిపించడం లేదు. మట్టి నమూనాలు కూడా తీసుకోవడం లేదు. రైతుల పట్ల చులకనభావం సరికాదు. –శివన్న, రైతు, రంగచేడు

ఇబ్బందులు లేకుండా చూస్తాం



అగ్రి ల్యాబ్‌లలో టెక్నికల్ ఏఓలు, ఏఈఓలు, ఎంపీఈఓలను అందుబాటులో ఉంచాం. ప్రస్తుతం టెస్టింగ్‌లు వచ్చినప్పుడు మాత్రమే వారిని వినియోగించి ఆ తర్వాత క్రాప్ బుకింగ్‌కు వాడుకుంటున్నాం. అగ్రి ల్యాబ్‌లపై నివేదిక తెప్పించుకుని పూర్తిస్థాయిలో పరీక్షలు మొదలయ్యేలా చర్యలు చేపడతాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – ఉమామహేశ్వరమ్మ, జేడీఏ

ప్లాస్టిక్‌ను స్వచ్ఛందంగా నిషేధించాలి

- ప్రజలకు కలెక్టర్ ఆనంద్ పిలుపు

అనంతపురం అర్బన్/రాప్తాడు రూరల్: ''పర్యావరణానికి ప్లాస్టిక్ చేటు చేస్తుంది. పర్యావరణం దెబ్బతింటే మానవ మనుగడకే ప్రమాదం. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలి'' అని కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా ఏక్‌దిన్.. ఏక్ గంట... ఏక్ సాథ్ (ఒకరోజు–ఒక గంట–అందరూ కలిసి)'లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌ను తొలుత గ్రీన్ ఆఫీసుగా తీర్చిదిద్దుతామన్నారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా బట్ట, జనపనార సంచులు వాడుతూ, తోటి వారూ వాడేలా చైతన్యపర్చాలన్నారు. ఈ కార్యక్రమం ఒకరోజు చేయాల్సింది కాదని, ఇంట్లో మనం ఎలా శుభ్రం చేసుకుంటామో, అలాగే మన పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రతలో మునిసిపల్, పంచాయతీ వర్కర్లకు ప్రజలు సహకారం అందించాలన్నారు. అనంతరం పర్యావరణహిత బట్ట బ్యాగులు పంపిణీ చేశారు. ప్రజలతో మమేకమై కలెక్టర్ చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. పిల్లిగుండ్ల కాలనీ సీతారాముల ఆలయ సమీపంలోని గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, సంపూర్ణ పోషణ్ అభియాన్ కింద పౌష్టికాహార మాసోత్సవాల స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మలోల, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్‌బాబు, సర్పంచ్ కృష్ణయ్య,స్వాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని శంకర్, జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ పాల్గొన్నారు.



క్రీడోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు

రెవెన్యూ క్రీడోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతి ఉత్సవాలు నవంబరు 7,8,9 తేదీల్లో జరగనున్నాయి. ఇందుకు సంబంధించి పోస్టర్లను కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల్లో స్నేహభావం, ఐక్యత, క్రీడాస్ఫూర్తి, సాంస్కృతిక విలువలు పెంపొందించేందుకు ఇలాంటి ఉత్సవాలు తోడ్పతాయన్నారు. అనంతరం లాటరీ విధానంలో డ్రెస్‌కోడ్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీరాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమశేఖర్, ఎఫ్ఎస్ఓ జి.రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

అమ్మా.. నేనేం పాపం చేశా!

కడుపులో నేను పడ్డానని
తెలియగానే మురిసిపోయావు..
నవమాసాలు కంటికి రెప్పలా మోశావు..
పురిటి నొప్పులు తట్టుకున్నావు..
నువ్వు పునర్జన్మ పొంది..
నాకు జన్మనిచ్చావు..
ఇంత చేసి చివరికి ఆప్యాయత
పంచకుండానే పడేశావు...
అసలు నేనేం పాపం చేశానమ్మా!
(అనంతపురం నగరంలో రోడ్డు పక్కన
పడి ఉన్న ఓ పసికందు అంతరంగానికి
అక్షర రూపమిది)



నవజాత శిశువును ఆస్పత్రి వైద్యులకు అప్పగిస్తున్న దృశ్యం

అనంతపురం: అప్పుడే పుట్టిన పసికందును నిర్దాక్షిణ్యంగా రోడ్డుపై పడేసి వెళ్లిన ఘటన గురువారం అనంతపురం నగరంలో సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆడబిడ్డ అనే చిన్నచూపో లేక మరేదైనా కారణమో గానీ ముక్కుపచ్చలారని శిశువును అమానవీయంగా వదిలేసి వెళ్లారు. వివరాల్లోకి వెళితే... అనంతపురం సాయినగర్ ఏడో క్రాస్‌లో గురువారం తెల్లవారుజామున నవజాత శిశువును పాలిథిన్ కవర్‌లో చుట్టి రోడ్డు పక్కన వదిలిపెట్టారు. శిశువు ఏడుపు విని చుట్టుపక్కల ఇళ్ల వారు నిద్రలేచి అధికారులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ ఎస్ఐ రుష్యేంద్ర, ఐసీడీఎస్ పీడీ ఎం.నాగమణి, డీసీపీఓ మంజునాథ్, మూడో సచివాలయం మహిళా పోలీస్ టీఎం సుస్మిత, ఏఎన్ఎం లక్ష్మి అక్కడికి చేరుకుని నవజాత శిశువును స్థానిక ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో శిశువుకు చికిత్స అందిస్తున్నారు. 72 గంటలు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలని తెలిపారు. శిశువుకు కావాల్సిన పాలను మదర్ మిల్క్ బ్యాంకు నుంచి అందిస్తున్నారు. శిశువును వదిలేసి వెళ్లిన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఎదుగుదలను ఓర్వలేక అంతమొందించారా?

- వైఎస్సార్‌సీపీ నాయకుడు సతీష్‌రెడ్డి మరణంపై అనుమానాలెన్నో!
- స్వగ్రామంలో ఓ టీడీపీ నాయకుడితో విభేదాలున్నట్లు వినికిడి



సతీష్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

పామిడి: వైఎస్సార్‌సీపీ నాయకుడు సతీష్‌రెడ్డి ఎదుగుదలను ఓర్వ లేక ప్రత్యర్థులు అంతమొందించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం రాత్రి మండలంలోని కాలాపురం గ్రామ సమీపాన వైఎస్సార్ సీపీ రూరల్ బూత్ కన్వీనర్ల ప్రెసిడెంట్ దేవన సతీష్‌రెడ్డి (34) మృతిపై పలు అనుమానాలు నెలకొన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. సతీష్ రెడ్డి, అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు మంచి స్నేహితులు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం సదరు టీడీపీ నాయకుడి కుటుంబ వ్యవహారంలో సతీష్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. దీంతో మిత్రుడి కుటుంబంలోని టీడీపీ నాయకుడికి, సతీష్ రెడ్డికి మధ్య విభేదాలు తలెత్తాయి. గతంలో ఆ వ్యక్తి వాటర్ ప్లాంట్ విషయంలోనూ సతీష్‌రెడ్డి జోక్యం చేసుకొన్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామం వదిలిపెట్టి వెళ్లిన సదరు టీడీపీ నాయకుడు ఇటీవలే పామిడిలో ప్రత్యక్షమయ్యాడు. సతీష్‌రెడ్డి వైఎస్సార్ సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఎదిగిపోతుండడం చూసి ఓర్వలేకపోయాడని, ఎలాగైనా అంతమొందించాలని భావించి బుధవారం రాత్రి హత్యకు పాల్పడ్డాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు పోస్టుమార్టం చేశాక పోలీసులు సతీష్‌రెడ్డి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకుండా ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులంటూ వేచి ఉండడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

రోడ్డు ప్రమాదమట..!

రోడ్డు ప్రమాదం కారణంగానే సతీష్ రెడ్డి మృతి చెందాడని ఓ వ్యక్తి గురువారం రాత్రి పోలీసు ప్రతినిధినంటూ 'సాక్షి'కి ఫోన్ చేసి తెలపడం గమనార్హం. సీసీ ఫుటేజీల్లో ఓ ట్రాక్టర్, సతీష్ రెడ్డి ద్విచక్రవాహనం ఒకదాని వెనుక ఒకటి వెళ్లినట్లు కనిపించాయని, ఆ ట్రాక్టర్‌ను సతీష్‌రెడ్డి ద్విచక్రవాహనం ఢీ కొనడంతోనే తీవ్ర గాయాలపాలై చనిపోయాడని చెప్పారు. ట్రాక్టర్ రేకు కారణంగా సతీష్‌రెడ్డి గొంతు కోసుకుపోయి ఉంటుందన్నారు. మరోవైపు సతీష్‌రెడ్డి మృతిపై అనుమానాలు ఉన్నాయని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపట్టి వాస్తవాలు బహిర్గతం చేస్తామంటూ పామిడి ఇన్‌చార్జ్ సీఐ రాజు తెలపడం గమనార్హం. సతీష్‌రెడ్డి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ముందు భాగం పూర్తిగా ధ్వంసమైందని, కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే క్లూస్ టీం, పోలీసు జాగిలాల సాయంతో ఆధారాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని, అధైర్య పడరాదని సతీష్‌రెడ్డి కుటుంబసభ్యులకు గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ధైర్యం చెప్పారు. గురువారం జీ కొట్టాల గ్రామంలో నిర్వహించిన సతీష్ రెడ్డి అంత్యక్రియల్లో వైవీఆర్ పాల్గొన్నారు. సతీష్ రెడ్డి తల్లి సుంకురత్నమ్మ, తండ్రి కాశీవిశ్వనాథరెడ్డి, సోదరి మహాలక్ష్మి, సోదరులు సుదర్శన్‌రెడ్డి, వెంకట నరసింహారెడ్డి, బంధువులను ఓదార్చారు. విషయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. సతీష్‌రెడ్డి మృతి అంశాన్ని అధిష్టానం సీరియస్‌గా తీసుకుందని, బాధిత కుటుంబానికి అండగా ఉంటానని జగనన్న భరోసానిచ్చారని తెలిపారు. ఆయన వెంట పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు బోయ రామచంద్ర, సునీల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, పామిడిలోని సీహెచ్‌సీ మార్చురీలో సతీష్‌రెడ్డి మృతదేహానికి డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం. వీరాంజనేయులు నివాళులర్పించారు.

క్లుప్తంగా

రేపటి నుంచి రెండోదశ డిగ్రీ అడ్మిషన్లు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డిగ్రీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం నుంచి రెండోదశ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్కియాలజీ, హిస్టరీ, స్టాటిస్టిక్స్, జర్నలిజం, క్రియేటివ్ రైటింగ్, డేటా సైన్స్, మార్కెటింగ్ అండ్ సేల్స్, బయో ఇన్ఫర్మేటిక్స్, ఆర్గానిక్ ఫార్మింగ్, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, తెలుగు, మ్యాథమెటిక్స్, అనిమల్ బయోటెక్నాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వంటి విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఈ నెల 29 నుంచి అక్టోబర్ 1వరకు వెబ్ ఆప్షన్ ఎంపిక ఉంటుంది.

యువ పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం టౌన్: రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి సమీపంలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఇండస్ట్రీయల్ పార్క్ పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న యువ పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్క్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామన్నారు. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించాయన్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక రాయితీలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఓసీ, బీసీలకు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న పారిశ్రామిక వేత్తలు బళ్లారి రోడ్డులోని ఏపీఐఐసీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సీటీఓ ఉద్యోగులపై విచారణకు ఆదేశం

గుంతకల్లు: స్థానిక వాణిజ్య శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఏసీటీఓ, అటెండర్ అవినీతిపై విచారణకు రాష్ట్ర వాణిజ్య శాఖ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఇరువురిపై సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ ఈ నెల 16న సీటీఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఫిర్యాదుకు స్పందించిన వాణిజ్య శాఖ అధికారులు అక్టోబర్ 1న వ్యాపారుల సమక్షంలో విచారణ జరిపించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు ఫిర్యాదుదారుడు గురువారం తెలిపారు.

ప్రయాణం.. ప్రహసనం

దసరా పండుగ నేపథ్యంలో కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో జిల్లా కేంద్రంలోని వివిధ ప్రైవేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యాసంస్థల వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో పిల్లలను పిలుచుకెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణం కావడంతో గతంలో కంటే భిన్నంగా ఈ సారి తల్లులే అత్యధికంగా వచ్చారు. బస్సుల సంఖ్య పెంచక పోవడంతో ఉన్న బస్సులన్నీ కిక్కిరిశాయి. బస్టాండ్ పాయింట్‌లో బస్సు ఆగగానే ఎక్కేందుకు మహిళలు పోటీ పడ్డారు. తోపులాట చోటు చేసుకుంది. ఇక పురుషులు బస్సు కిటికీల నుంచి లోపలకు ప్రవేశించాల్సి వచ్చింది.

– అనంతపురం క్రైం/సాక్షి ఫొటోగ్రాఫర్:



అనంతపురం బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు తోసుకుంటున్న మహిళలు









చిన్నారిని లోపలకు తీసుకుంటున్న దృశ్యం, మహిళల తోపులాట ఉండడంతో కిటికీ నుంచి బస్సులోకి వెళుతున్న ప్రయాణికులు, తోపులాటలో చిక్కుకుని రోదిస్తున్న మహిళ

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులే బలవన్మరణాలకు కారణంగా తెలుస్తోంది.



తిప్పేస్వామి (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక రాచప్పబావి కాలనీకి చెందిన తిప్పేస్వామి (34) ఆత్మహత్య చేసుకున్నాడు. బ్రహ్మసముద్రం మండలం ముప్పులకుంట గ్రామానికి చెందిన తిప్పేస్వామి జేసీబీ ఆపరేటర్గా పనిచేస్తూ రెండు నెలల క్రితం రాచప్ప బావి కాలనీలోని అద్దె ఇంటికి మకాం మార్చాడు. భార్య గీతాంజలి, నాలుగేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ మనోవేదనకు లోనైన ఆయన గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

అనంతపురం సిటీ: అనంతపురం–తాటిచెర్ల మార్గంలోని డౌన్ లైన్ మధ్యలో రైలు కింద పడి గుర్తు తెలియని ఓ యువకుడు(35) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. తల నుజ్జునుజ్జు కావడంతో మృతుడిని గుర్తించడం కష్టమైంది. సమాచారం అందుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ దామోదర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

దళారుల రాజ్యం.. రైతు నిలువు దోపిడీ

- ఆదాయం రాకపోగా రైతన్నకు చేతి నుంచి రూ.600 ఖర్చు



ప్యాపిలి మార్కెట్‌లో వేలానికి ఉంచిన టమాట బాక్సులు (ఇన్‌సెట్) రైతు షేక్ రఫీ

పెద్దపప్పూరు: దళారులు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తుండడంతో టమాట రైతు నిలువు దోపిడీకి గురయ్యాడు. పంటను మార్కెట్‌కు తరలిస్తే లాభం మాట దేవుడెరుగు... రైతు చేతి నుంచే రూ. వందలు ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చింది. వివరాలు... పెద్దపప్పూరుకు చెందిన టమాట రైతు షేక్ రఫీ గురువారం 25 కిలోల చొప్పున 31 బాక్సుల టమాటను బొలెరో వాహనంలో నంద్యాల జిల్లా ప్యాపిలిలోని మార్కెట్‌లో విక్రయానికి తీసుకెళ్లాడు. ఇందుకుగాను వాహనానికి రూ.1,500 అద్దె చెల్లించాడు. అక్కడి దళారులు గ్రేడింగ్ చేసి 31 బాక్సులను కాస్త 23 బాక్సులకు కుదించారు. బాక్స్‌కు రూ.70 చొప్పున వేలం పాడడంతో రూ.1,610 వచ్చింది. దళారుల కమీషన్ రూ.160 పోను రూ.1,450 చేతికి అందింది. పంట కోసిన కూలీలకు రూ. 600 రైతు చేతి నుంచి ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చింది. ఒక్క రూపాయి ఆదాయం రాకపోగా చేతి నుంచి మరింత ఖర్చు పెట్టాల్సి రావడంతో రైతు ఆవేదనకు అంతులేకుండా పోయింది.



బాక్సు టమాటకు రూ.70తో వేసిన బిల్లు

'గురుకుల' సిబ్బంది నిర్లక్ష్యానికి చిన్నారి మృతి



బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యానికి ఓ చిన్నారి బలైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సేవా సుప్రీం ఏజెన్సీ కింద పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న కృష్ణవేణి కుమార్తె, 17 నెలల వయసున్న చిన్నారి 3 రోజుల క్రితం గురుకుల పాఠశాల సిబ్బంది కాచి పక్కన ఉంచిన పాలలో పడి తీవ్రంగా గాయపడింది. దీంతో గుట్టుచప్పుడు కాకుండా చిన్నారిని కర్నూలులోని ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చిన్నారి మృతి చెందింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని దళిత సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జిల్లాకు చేరిన 756 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: స్పిక్ కంపెనీకి చెందిన 756.315 మెట్రిక్ టన్నుల యూరియా, 586 మెట్రిక్ టన్నుల 20–20–0–13, 113.6 మెట్రిక్ టన్నులు 10–26–26 రకం కాంప్లెక్స్ ఎరువులు జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా గురువారం చేరిన యూరియాను ఆయన పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు 450 మెట్రిక్ టన్నుల యూరియాను మార్క్‌ఫెడ్‌కు, మిగతా 306.315 మెట్రిక్ టన్నులను ప్రైవేట్ డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు.



అధినేతతో భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన డాక్టర్ శైలజనాథ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, పార్లమెంట్ కార్యదర్శి రఘునాథరెడ్డి

అనంతపురం కార్పొరేషన్/శింగనమల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ శింగనమల నియోజకవర్గ నాయకులు పలువురు వేర్వేరుగా కలిశారు. కలిసిన వారిలో నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, పార్లమెంట్ కార్యదర్శి, పుట్టపర్తి – కదిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు నిట్టూరు రఘునాథరెడ్డి ఉన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



కణేకల్లులోని ఆర్ఎస్‌కే వద్ద క్యూలో ఉంచిన పాసు పుస్తకాలు



ఆత్మకూరు మండలం మదిగుబ్బ ఆర్ఎస్‌కే వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

కణేకల్లు/ఆత్మకూరు: యూరియా కష్టాలు రైతులను వీడడం లేదు. గురువారం కణేకల్లులోని ఆర్ఎస్‌కే, ఆదర్శ భారతి రైతు సేవా కేంద్రాల వద్ద, ఆత్మకూరు మండలం మదిగుబ్బ గ్రామంలోని ఆర్ఎస్‌కే వద్ద గంటల తరబడి రైతులు పడిగాపులు పడాల్సి వచ్చింది. కణేకల్లులో ఎండలో నిలబడలేక పాసు పుస్తకాలను క్యూ లైన్‌లో ఉంచారు. తమ వంతు రాగానే టోకెన్లు చూపి యూరియా బస్తాను తీసుకెళ్లారు. వ్యవసాయ అధికారులు స్పందించి ఒక్కో రైతుకు ఐదారు బస్తాలిస్తే కొంత ఊరట ఉంటుందని ఈ సందర్భంగా పలువురు రైతులు కోరారు.

21 ఎల్‌పీజీ సిలిండర్ల సీజ్

గుత్తి: స్థానిక గాంధీ సర్కిల్ సమీపంలో జిలాన్ గ్యాస్ ఫిల్లింగ్ దుకాణంలో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమంగా నిల్వ చేసిన 21 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ నరేంద్ర భూపతి, సీఎస్‌డీటీ జీవీ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

రాప్తాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం పాతూరులోని భవానీ నగర్‌లో నివాసముంటున్న కురుబ మల్లేశప్ప (53), రమాదేవి దంపతులు తోపుడు బండిపై అరటి కాయల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మల్లేశప్ప రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలో అరటి తోటలు చూసుకుని 44వ జాతీయ రహదారి దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి శరవేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో పాటు ఉడాయించాడు. రాత్రి 7 గంటలకు మృతుడిని మల్లేశప్పగా కుటుంబసభ్యులు నిర్ధారించారు. ఘటనపై సీఐ టి.వి.శ్రీహర్ష కేసు నమోదు చేశారు.

'ఎస్ఆర్ఐటీ'కి జాతీయ గుర్తింపు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధ్యాపకులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ గురువారం వెల్లడించారు. ఇటీవల భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, యూజీసీ మద్దతుతో నిర్వహించిన జాతీయ స్థాయి పర్యావరణ సంరక్షణ్ పోటీల్లో ఎస్ఆర్ఐటీకి చెందిన 23 మంది విద్యార్థులు ప్రతిభ చాటారు. దేశంలోనే అత్యున్నత స్థాయిలో ఉన్న వంద విద్యాసంస్థలు పోటీకి హాజరు కాగా, ఎస్ఆర్ఐటీకి 85వ స్థానం దక్కింది. ఏపీ నుంచి ప్రాతినిథ్యం వహించిన మొట్టమొదటి విద్యాసంస్థగా ఎస్ఆర్ఐటీకి ఖ్యాతి దక్కింది. ప్రతిభ చాటిన విద్యార్థులను గురువారం కళాశాలలో అధ్యాపకులు అభినందించారు.

క్లుప్తంగా

జాతీయ త్రోబాల్ జట్టుకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ సిబ్బంది

అనంతపురం రూరల్: బాపట్ల ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 21న నిర్వహించిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యారులు ఐదుగురు త్రోబాల్ జాతీయ జట్టుకు ఎంపికై నట్లు త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభు కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 120 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో ఐదుగురు ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు జాతీయ జట్టుకు ఎంపికయ్యారన్నారు. బాలుర జట్టుకు ప్రభువరన్ రాయక్, సాజిద్‌హుస్సేన్, బాలికల జట్టుకు దర్శితారెడ్డి, ఎం. ప్రీతి, హర్షిత ఎంపికయ్యారన్నారు. అక్టోబర్ 24 నుంచి 27 వరకు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను గురువారం స్కూల్ చైర్మన్ అరుణ్‌కుమార్ రెడ్డి, డైరెక్టర్ విన్నూత్న రెడ్డి, సిబ్బంది అభినందించారు.

చౌక మందులపై పరిశోధన చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అనంతపురం: ప్రజారోగ్యం దృష్ట్యా చౌకగా లభించే ఔషధాలపై పరిశోధన చేయాలని ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి సూచించారు. జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలోని ఓటీపీఆర్ఐలో వరల్డ్ ఫార్మసిస్ట్ డే సందర్భంగా గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు, సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ (అనంతపురం) మహిళా సాధికారత డైరెక్టర్ ప్రొఫెసర్ వీబీ చిత్ర, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.లహరి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల ధర్నా



ఎస్ఈ రాజశేఖర్‌ను చుట్టుముట్టిన సీఐటీయూ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థలో విధులు నిర్వర్తించే ఓ కార్మికుడిపై ఇంజినీరింగ్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని తప్పుబడుతూ సీఐటీయూ నాయకులు గురువారం కమిషనర్ చాంబర్ ముందు ధర్నా చేపట్టారు. బుడ్డప్ప నగర్‌లోని ట్యాంక్ వద్ద వెల్డింగ్ పనులకు గౌరీశంకర్ అనే కార్మికుడు గైర్హాజరవడంతో ఇంజినీర్లు ప్రైవేట్ వ్యక్తులతో చేయించాలని నిర్ణయించారు. ఈ విషయంలో గౌరీశంకర్, వెల్డర్ల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గౌరీశంకర్‌పై నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు,సిబ్బంది వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఈ నెల 23న ఫిర్యాదు చేశారు. ఇందుకు నిరసనగా సీఐటీయూ నాయకులు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ధర్నా చేపట్టారు. ఎస్ఈ రాజశేఖర్ చాంబర్‌ను ముట్టడించారు. కమిషనర్ బాలస్వామి చాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. గౌరీశంకర్ తప్పు లేకపోయినా పోలీసులకు ఎలా ఫిర్యాదు చేస్తారని ప్రశ్నించారు. కమిషనర్ వారికి సర్దిచెప్పారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాజ, గోపాల్, తదితరులున్నారు.

మార్మోగుతున్న గోవింద నామస్మరణ

అనంతపురం కల్చరల్: గోవింద నామస్మరణతో నగరంలోని రామనగర్, శ్రీనివాసనగర్, హౌసింగుబోర్డుల్లోని శ్రీ వేంకటేశ్వరాలయాలు ప్రతిధ్వనిస్తున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రధాన అర్చక బృందం హరికిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నవగ్రహ హోమం, దీక్షా హోమం వేదపండితుల మంత్రోచ్చాటనల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీవారు సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడై వేంకటేశ్వరుడు సింహ వాహనంపై విహరించి పూజలందుకున్నారు.

ఎంబీఏతో విస్తృత అవకాశాలు

అనంతపురం: ఎంబీఏ కోర్సుతో విస్తృత అవకాశాలు ఉంటాయని జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో ఎంబీఏ విభాగం నూతన భవనాన్ని వీసీ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రం...అధ్వానం

- రోగులకందించే డైట్ నిర్వహణ అస్తవ్యస్తం
- ఆహారం తయారీ ప్రాంతంలో అధ్వాన పరిస్థితులు
- చోద్యం చూస్తున్న సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులు



అధ్వాన స్థితిలో డైట్ తయారీ భవనం



భవనం లోపల దుస్థితి

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలో రోగులకందించే ఆహారం (డైట్) విషయంలో జీజీహెచ్ అధికారులు ముందుచూపు లేకుండా వ్యవహరించారు. డైట్ నిర్వహించే ప్రాంతంలో సౌకర్యాలు మెరుగుపర్చకుండా కొత్త కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేశారు. దీంతో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలోనే 'డైట్' తయారు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

పట్టని ఉన్నతాధికారులు..

సర్వజనాస్పత్రిలో డైట్ వండే భవనాన్ని, ఆ ప్రాంతాన్ని చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఆస్పత్రి వెనుక వైపు ఉన్న పాత భవనంలో ఆహారం వండుతున్నారు. గతంలో 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించగా.. అప్పట్లో కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. ఇక్కడ ఎటువంటి సురక్షిత ప్రమాణాలు పాటించడం లేదని, ఆహారంతో రోగులకు ఇబ్బందిగా మారుతుందని ఫుడ్ సేఫ్టీ అధికారులు నివేదికను సమర్పించారు. అప్పట్లో ఆస్పత్రి ఉన్నతాధికారులు ఆహారం వండే భవనాన్ని పరిశీలించి పెయింటింగ్ వేయించాలని, నిర్వహణ సరిగా చేయాలని పాత కాంట్రాక్టర్‌కు చెప్పారు. తమ పరిధిలో లేని వాటిని తామెలా చేయాలని కాంట్రాక్టర్ చెప్పడంతో అధికారులు మిన్నకుండిపోయారు. ఈ క్రమంలో నూతనంగా 'డైట్' కాంట్రాక్ట్ ఇచ్చే ముందైనా సురక్షిత ప్రమాణాలు కల్పించడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం వర్షం పడితే భవనం పైకప్పు నుంచి నీరు కారుతోంది. కూరగాయలను ప్రత్యేక బుట్టల్లో వేయకుండా మూలకు పడేశారు. టైల్స్ సరిగా లేకపోవడంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచింది. భవనం పక్కన కాలువ బ్లాక్ కావడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కరెంటు సరఫరా సరిగా లేకపోవడంతో పాటు సరైన ఫ్యాన్లు కూడా లేవు.

జేసీ పరిశీలిస్తే వెలుగులోకి వాస్తవాలు..



డైట్ నిర్వహణ కాంట్రాక్ట్‌ను రెండు నెలలుగా పెండింగ్‌లో ఉంచారు. కాంట్రాక్టర్లు ఇద్దరూ ఒకే బిడ్ వేయడంతో ఎవరికివ్వాలనే విషయంపై మల్లగుల్లాలు పడ్డారు. చివరకు ఆస్పత్రి అధికారుల సిఫార్సు, నూతన కాంట్రాక్ట్ అనుభవం పేరుతో ఓ వ్యక్తికి కాంట్రాక్ట్ అప్పగించారు. ఈ క్రమంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాయింట్ కలెక్టర్‌నే సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్ తప్పుదోవ పట్టించినట్లు తెలిసింది. జేసీ ఒకసారి ఆస్పత్రిని పరిశీలిస్తే ఇక్కడి వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆస్పత్రి వర్గాలంటున్నాయి.

ఎక్కడి చెత్త అక్కడే

- రుద్రంపేటలో పంచాయతీ సిబ్బంది ఇష్టారాజ్యం



రుద్రంపేట-ఆలమూరు ప్రధాన రహదారి వద్ద పేరుకుపోయిన చెత్త

అనంతపురం రూరల్: జిల్లా పంచాయతీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న రుద్రంపేట పంచాయతీ చెత్తమయమైంది. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో కొన్ని రోజుల నుంచి చెత్త తరలించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో ఇప్పటికే ఎంతో మంది విష జ్వరాల బారినపడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న పంచాయతీలోనే ఇలాంటి దుస్థితి నెలకొంటే ఇక మిగిలిన పంచాయతీల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించే విధంగా చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడతారో లేదో వేచి చూడాలి.

జగనన్నతో భేటీ



అనంతపురం కార్పొరేషన్: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం పార్టీ నగర మహిళా విభాగం అధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, ఎస్సీ సెల్ నాయకుడు సాకే కుళ్లాయస్వామి కుటుంబ సభ్యులు కలిశారు.

తక్కువ వడ్డీతో గృహ, వాహన రుణాలు

- పోస్టర్ విడుదలలో ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి, సీనియర్ మేనేజర్లు

అనంతపురం అగ్రికల్చర్: దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ద్వారా తక్కువ వడ్డీరేట్లతో గృహ, వాహన రుణాలు మంజూరు చేయనున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. సీనియర్ మేనేజర్లతో కలిసి గురువారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ గృహ రుణాలపై 7.75 శాతం వడ్డీరేటు, వాహన రుణాలపై 8.40 శాతం వడ్డీరేటు నుంచి ప్రారంభమవుతాయన్నారు. గరిష్టంగా రూ.కోటి వరకు రుణం మంజూరు చేస్తామన్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా వడ్డీరేట్లు ఇంకా తగ్గుతాయని తెలిపారు. ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఇతర బ్యాంకుల్లో ఉన్న అకౌంట్లను టేక్‌ఓవర్ చేస్తామని, అందుకు ఎలాంటి లీగల్ అండ్ వాల్యుయేషన్ ఫీజు ఉండదని తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై మంచి వడ్డీ రేట్లు వర్తింపజేస్తామన్నారు. త్వరలోనే కొత్త సాఫ్ట్‌వేర్, నూతన మార్గదర్శకాలు విడుదల కానున్న నేపథ్యంలో అన్నింటినీ సర్దుబాటు చేసుకునేందుకు దసరా తర్వాత నాలుగైదు రోజులు బ్యాంకింగ్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ముందస్తుగా తెలియజేశారు.

శ్రమదానం: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం స్థానిక పీటీసీ, నడిమివంక, ఫ్లైఓవర్ కింద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ఉద్యోగులు శ్రమదానం నిర్వహించారు. 'ఏక్‌దిన్-ఏక్ గంట- ఏక్‌సాత్'లో భాగంగా స్వచ్ఛతా సేవా కార్యక్రమం నిర్వహించినట్లు ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి తెలిపారు.

'పశుదాన్' యాప్‌లో గాలికుంటు టీకాలు



నిల్వ చేసిన టీకాలను పరిశీలిస్తున్న వీబీఆర్ఐ ఏడీ డాక్టర్ కళావతి

అనంతపురం అగ్రికల్చర్: ముందస్తు వ్యాధి నిరోధక కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పశువులు, గేదెలు, ఎద్దులకు ఇస్తున్న గాలికుంటు వ్యాధి టీకాలు వంద శాతం పూర్తి చేయాలని, ఆ తర్వాత 'పశుదాన్' యాప్‌లో అప్‌లోడ్ చేయాలని విజయవాడ వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (వీబీఆర్ఐ) ఏడీ డాక్టర్ కళావతి ఆదేశించారు. టీకాల కార్యక్రమ పర్యవేక్షణకు లైజన్ ఆఫీసర్‌గా జిల్లాకు వచ్చిన ఏడీ గురువారం స్థానిక పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (ఏడీడీఎల్)ను సందర్శించారు. పశువుల నుంచి సేకరించిన రక్తనమూనాలు, ఇతరత్రా నమూనాలు, టీకాలను ఎలా భద్రపరుస్తున్నారనే దానిపై ఏడీడీఎల్ ఏడీ డాక్టర్ జి.రవిబాబును అడిగి తెలుసుకున్నారు. టీకాలు వేసి ట్యాగ్ చేసిన తర్వాత తప్పనిసరిగా పశుదాన్ యాప్‌లో పొందుపరచాలని ఆదేశించారు. గాలికుంటు టీకాల వివరాలు, కార్యాలయానికి సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. పశుసంరక్షణ, జీవసంరక్షణ లక్ష్యంగా క్రమం తప్పకుండా ఉచిత టీకాల కార్యక్రమాలు కొనసాగిస్తూ వాటిని జీవాల పెంపకందారులు, రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు.

ఎవరు సైకోనో అందరికీ తెలుసు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్



అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర చరిత్రలో సుపరిపాలన అందించిన సీఎంగా కీర్తి గడించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సైకో అంటూ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడడం సరికాదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ ఓ ప్రకటనలో విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రిపై అలా మాట్లాడడాన్ని బాలకృష్ణ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. తన ఇంట్లో జరిగిన కాల్పుల ఘటన కేసులో కోర్టుకు ఏ రకమైన సర్టిఫికెట్‌ను సమర్పించి బయటపడ్డాడో గుర్తు చేసుకుంటే ఎవరు సైకోపో రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా బాలకృష్ణ అభిమానులకు తెలుస్తుందని మండిపడ్డారు. 'మీ ఆటవిక భాష, చర్యలు తగ్గించుకోవాలి' అని బాలకృష్ణకు హితవు పలికారు.

క్రీడా సామగ్రి పంపిణీ

అనంతపురం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తైక్వాండో క్రీడాకారులకు యూనిఫాం, షూ, క్రీడా సామగ్రిని ఉచితంగా అందించారు. స్థానిక కేఎస్ఆర్ అర్బన్ సిటీలోని తైక్వాండో శిక్షణ కేంద్రంలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, ది బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సీఈఓ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, రోటరీ క్లబ్ అనంతపురం సెంట్రల్ అధ్యక్షుడు గల్లా హర్ష, జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కే. శాంతరాజ్, సెంట్రల్ సభ్యులు సూర్యనారాయణ, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

రాప్తాడు: పరిసరాల పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవని, అందువల్ల ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 'ఏక్ దిన్...ఏక్ గంట...ఏక్ సాథ్' కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ... మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ ప్రేమ్ కుమార్, ఏఓ భాను రేఖ, జూనియర్ అసిస్టెంట్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా నమోస్తుతే

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా కొనసాగాయి. వాడవాడలా అమ్మవారు విభిన్న రూపాలలో సాక్షాత్కరించి పూజలందుకున్నారు. భక్తజనంతో ఆలయాలు కిటకిటలాడాయి.

– అనంతపురం కల్చరల్:



శాకంబరి అలంకరణలో ఆత్మకూరు మండలం వడ్డుపల్లి సుంకులమ్మ



రాప్తాడులో కాత్యాయినీ దేవిగా దర్శనమిచ్చిన పార్వతీదేవి



ధనియాల అలంకారంలో దర్శనమిస్తున్న రేణుకాయల్లమ్మ



అనంతపురంలో ప్రత్యేక అలంకరణలో నిముషాంబదేవి




సాయిబాబు ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు



శంకరమఠంలో వైష్ణవీదేవిగా అమ్మవారు



అనంతపురం కొత్తూరు అమ్మవారి శాలలో విశేషాలంకారం



పాతూరులో శాకంబరీ అలంకారంలో వాసవీమాత



గోసాల చంద్రగుత్తి రేణుక యల్లమ్మ ఆలయంలో పూజలు



టౌన్‌బ్యాంకు వద్ద అమ్మవారి సేవలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



కొత్తూరు అమ్మవారి శాలలో భక్తజనం

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



'పోషణ్ మహా'పై ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు



పౌష్టికాహారం గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

రాప్తాడురూరల్: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఐసీడీఎస్ అనంతపురం రూరల్-5 సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి సూచించారు. గురువారం అనంతపురం రూరల్ మండలం ఏ. నారాయణపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్, బాల రక్ష భారత్ సంయుక్త ఆధ్వర్యంలో జనరల్ సెంట్రల్ ఇన్సూరెన్స్ సహకారంతో 'పోషణ్ మహా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహార సరుకులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఆత్మకూరు: పౌష్టికాహారంతో తీసుకునే వారు ఆరోగ్యంగా ఉంటారని, అందువల్ల అందరూ పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి, లావణ్య తెలియజేశారు. గురువారం మండలంలోని మదిగుబ్బ, పంపనూరు గ్రామాల్లో 'పోషణ్ పక్వాడ, పోషణ్ వేడుక' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు.

పూలకుంటలో వ్యక్తిపై దాడి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పూలకుంటలో చిత్రా వెంకటరాముడుపై అదే గ్రామానికి చెందిన కంటగాని సాయికుమార్, కంట గాని రామయ్య, బిల్లే ఈరప్ప దాడి చేశారు. బాధితుడు గురువారం ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వెంకటరాముడు ఫిల్టర్ వాటర్ ప్లాంటులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం వాటర్ ప్లాంటుకు వెళ్లాడు. ఈరప్ప, సాయి కుమార్, రామయ్య అక్కడికి చేరుకు న్నారు. తన కూతురి గురించి అల్లుడికి లేనిపోని చాడీలు చెప్పి వారి మధ్య గొడవలు ఎందుకు పెడుతున్నావంటూ ఈరప్ప గొడవపడ్డాడు. తానెందుకు గొడవ పెడతానని చెబుతున్నా వినకుండా దాడి చేశారు. మరోమారు వారి విషయంలో జోక్యం చేసుకుంటే చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శానిటేషన్ కిట్ల పంపిణీ



పంచాయతీ సిబ్బందికి శానిటేషన్ కిట్లను అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగకిష్టయ్య

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల గ్రామంలోని పారిశుద్ధ్య కార్మికులకు గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగకిష్టయ్య శానిటేషన్ కిట్లను అందజేశారు. అదే విధంగా సేంద్రియ ఎరువులతో పండించిన ఆకుకూరలు, కూరగాయలను అందించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు మహబూబ్‌బాషా, సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నేడు 'అనంత' నాటక ప్రదర్శన

అనంతపురం కల్చరల్: నంది నాటకోత్సవాల కోసం ప్రత్యేకంగా లలిత కళాపరిషత్తు కళాకారులు రూపొందించిన 'శకుని' నాటకాన్ని రాష్ట్రస్థాయిలో ప్రదర్శించనున్నారు. పల్లేటి కులశేఖర్ రచించిన ఈ నాటకాన్ని శుక్రవారం సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదర్శించడానికి రాష్ట్ర సాంస్కృతిక శాఖ అనుమతిచ్చినట్లు ఎల్కేపీ కార్యదర్శి పద్మజ పేర్కొన్నారు. దసర శరన్నవరాత్రులు వైభవంగా సాగే దుర్గమ్మ సన్నిధిలో ప్రదర్శించనున్న అనంత నాటకాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన రంగస్థల కళాకారులను, సాంకేతిక నిపుణులను ఆమె అభినందించారు.

28న స.హ చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం

అనంతపురం కల్చరల్: పాలనలో కీలకమైన సమాచార హక్కు చట్టాన్ని రక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేయడానికి ఈనెల 28న స.హ. చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సమాచార హక్కు పరిరక్షణ సంఘం అధ్యక్షులు హొన్నూరప్ప తెలిపారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఉదయం 10.30 గంటలకు 'సమాచార హక్కు చట్టం అమలు -జిల్లా అధికారుల వైఖరి' అనే అంశంపై జరిగే సమావేశంలో యాక్టివిస్టులందరూ పాల్గొని సూచనలు, సలహాలందించాలని కోరారు.

పరిశోధనలతోనే ఆవిష్కరణలు

అనంతపురం కార్పొరేషన్: పరిశోధనలతోనే నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ అన్నారు. గురువారం వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగంలోని వైరల్ రీసెర్చ్ ల్యాబొరేటరీలో పీజీ విద్యార్థులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. పోలిమరైజ్ చైన్ రియాక్షన్, ఎలిసా పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైక్రో బయాలజీ

సంక్షిప్త వార్తలు

ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ డాక్టర్ ఆర్.హైమావతి, వైద్యులు డాక్టర్ శైలజ, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ప్రవీణ తదితరులున్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

రాప్తాడు: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా 'స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' నిర్వహిస్తున్నామని వైద్యాధికారి శివ కృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని గొల్లపల్లిలో గ్రామ సచివాలయం దగ్గర 'స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు మహిళలకు బీపీ, షుగర్, కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు హన్మంత్ రెడ్డి, సూపర్‌వైజర్ అరుణ తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలసిన వీసీ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు గురువారం జిల్లా నూతన కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్, స్టార్టప్ ఇన్నోవేషన్స్ గురించి కలెక్టర్‌కు వీసీ వివరించారు.

గేట్'పై అవగాహన

అనంతపురం: జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం సెమినార్ హాలులో గురువారం గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా సీవీఎస్ ప్రసన్న (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, బెంగళూరు) హాజరై అవగాహన కల్పించారు. గేట్ పరీక్షలో ఉత్తీర్ణులైతే మాస్టర్ డిగ్రీ, డాక్టర్ ఆఫ్ ఫెలోషిప్‌ను ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎస్సీలో చేయడానికి వీలు కలుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.శంకర్ పాల్గొన్నారు.